క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లో వేంచేసి యున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామి వారి ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ తనిఖీ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో ఈ లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ లెక్కింపులో పాల్గొని సహకరించవలసిందిగా కోరారు.

వసతిగృహ బాలికల భద్రతపై అవగాహన



కైకలూరు: వసతి గృహాల్లో చదువును అభ్యసించే బాలికలను కేవలం తల్లిదండ్రులతో మాత్రమే బయటకు పంపించాలని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు సూచించారు. కైకలూరు నియోజకవర్గం, మండవల్లి ఎస్సీ హాస్టల్ బాలికపై ముగ్గురు లైంగిక దాడి చేసిన నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఆదివారం ఆటపాక ఎస్సీ హాస్టల్ బాలికలకు భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ బాలికలు చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలన్నారు. భద్రత విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. హాస్టల్ వార్డెన్ నాగమణి నుంచి బాలికల అటెండెన్సు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటరత్నమ్మ, హెడ్ కానిస్టేబుల్ స్వామి మహిళా సంరక్షణ పోలీసులు హాజరయ్యారు.

మదరసా ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక 17వ వార్డులోని షాహి మజీద్ ప్రాంగణంలో ఆదివారం మదరసాను ముస్లిం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముస్లిం చిన్నారులకు ఉర్దు లిపితో ఖురాన్ బోధనలు చేస్తారన్నారు. మదరసా ఏర్పాటుకు సహకరించిన మోదీనా బేగ్, రిజ్వానా షరీఫ్ (గాంధీ)లకు మైనార్టీ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. రోజూ సాయంత్రం ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ భాజీ, ఉపాధ్యక్షుడు అలీబేగ్, నాయకులు రజక్ భాషా, రషీద్ బేగ్ కాజా, దాదాబేగ్, అబ్దుల్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పెదపారుపూడి: మండలంలోని మహేశ్వరపురం వద్ద పాత లింగవరం చానల్‌లో ఉన్న గుర్రపు డెక్కను ఇరిగేషన్ అధికారులు తొలగించారు. కొద్ది రోజుల కితం సాక్షిలో గుర్రపుడెక్క తొలగించాలని కథనం ప్రచురితమైనది. దీనిపై స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్రపు డెక్క తొలగించారు. గుర్రపుడెక్క తొలగించటం చివరి భూములకు సాగునీరు అందటంతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు తప్పవు



కోనేరుసెంటర్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అల్లర్లు అలజడలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని బందరు డీఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. బందరు సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ తన కార్యాలయంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెడు నడత కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఏ ఒక్కరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తుండాలని చెప్పారు. ముఖ్యమైన పనుల మీద బయటి ప్రాంతాలకు వెళ్లాలంటే సంబంధిత స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇనకుదురుపేట, ఆర్ పేట, పెడన రూరల్ సీఐలు ఉమామహేశ్వరరావు, రవికుమార్, వీరయ్య గౌడ్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

రోగుల చెంతకే వైద్యం



నా పేరు నీలపాల ప్రమీలరాణి. వయస్సు 65 సంవత్సరాలు. గుడివాడ మండలం గంగాధరపురం గ్రామం. బీపీ, కాళ్ల నొప్పులు, ఆయాసంతో బాధపడుతున్నా. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉండేది. వయస్సు మీరడంతో దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోవాలంటే ఖర్చుతోపాటు ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు అనుసంధానంగా నెలలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ సతీష్ కుమార్ ఇంటికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. స్వయంగా పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. సూచనలు ఇస్తున్నారు. దీంతో ఆరోగ్యం కుదుటపడుతోంది. మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్యం అందుతుంది. ప్రభుత్వం మేలు మరువలేను.



నాపేరు గూడేపల్లి బాయమ్మ, మాది కురుమద్దాలి గ్రామం. నేను గత కొంత కాలంగా హైబీపీతో బాధపడుతున్నాను. నేను తీసుకున్న ఆహారం ఫుడ్‌పాయిజన్ అవడంతో ప్రాణాపాయ స్థితికి చేరా. ఈనేపథ్యంలో ఫ్యామిలీ డాక్టర్ మా ఇంటికి వచ్చి నా ఆరోగ్యం గురించి ఆరా తీసి కావాల్సిన వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేసినా ప్రాణాలకు కాపాడారు. ఇంటికే పరిమితమైన పరిస్థితుల్లో నెలలో రెండు సార్లు ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ వైద్య సేవలను పొందుతున్నాను.

- సత్ఫలితాలు ఇస్తున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- నాడు మండల కేంద్రాలు, పట్టణాల్లో వైద్యం.. నేడు ఇంటివద్దే వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లె వాసులు
- మూడు నియోజకవర్గాల్లో రూ.కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం



మోటూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుడివాడరూరల్: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు వరంలా మారాయి. ఉచితంగా వైద్య సేవలు గ్రామాల్లోనే అందటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో వైద్యం అవసరమైతే పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడేవారు. స్థానికంగా ఉండే ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేది. దీర్ఘ రోగంతో బాధపడేవారు వ్యయ ప్రయాసలకోర్చి ఆస్పత్రులకు వెళ్లేవారు. ఆర్థిక పరిస్థితులు లేనివారు భవిష్యత్తుపై భారం వేసేవారు.



ప్రస్తుత పరిస్థితి ఇదీ..

నియోజకవర్గంలో వైద్యులు సచివాలయాల్లో ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులను నెలలో రెండుసార్లు నిర్వహిస్తున్నారు. సగటున ప్రతి హెల్త్ క్లినిక్‌లో 80 నుంచి 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోనే సాధారణ వ్యాధులకు సంబంధించి 12 రకాల వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. 14 రకాల వైద్య పరీక్షలను, 105 రకాల మందులను ఉచితంగా అందించేలా వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. షుగర్, బీపీ వంటి వ్యాధులతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడే వారికి ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా సందర్శించి విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు.

నియోజకవర్గంలో 27 హెల్త్ క్లినిక్‌లు..

గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ మండలంలో 6 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, గుడ్లవల్లేరు మండలంలో 9, నందివాడ మండలంలో 12 హెల్త్ క్లినిక్‌లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సొంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

పామర్రు: పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలి డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో సచివాయలం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు, ప్రభుత్వ డాక్టర్‌తో పాటుసిబ్బంది 104 వాహనం ద్వారా వచ్చి వైద్య పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. గతంలో దీర్ఘకాలరోగులు వైద్యకోసం వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో వైద్య సేవలు రోగుల ఇంటికే వచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు.

కైకలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో చిన్న చిన్న జబ్బులకు కూడా 10 కిలోమీటర్ల దూరంలో ఉండే పీహెచ్‌సీకి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

55 సెంటర్లు..రూ.10.75 కోట్లు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 55 వైఎస్సార్ హెల్త్ సెంటర్స్‌కు రూ.10 కోట్ల 75 లక్షల 60 వేలతో నిధులు కేటాయించారు. ఇప్పటికే 14 సెంటర్లు పూర్తయ్యాయి.

అందుతున్న సేవలు ఇవీ..

గర్భిణులు, చిన్నారుల సంరక్షణ, నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ, బాల్యం, కౌమార దశ ఆరోగ్య సంరక్షణ, కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక, ఇతర పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ, అంటు వ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, తీవ్రమైన, సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషెంట్ కేర్, అసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్, సాధారణ ఆప్తాల్మిక్ (కంటి సమస్యలు), ఈఎన్‌టీ సమస్యల కోసం జాగ్రత్తలు, ప్రాథమిక నోటి ఆరోగ్య సంరక్షణ, వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ, కాలిన గాయాలకు, ప్రమాదాల్లో గాయపడిన (ట్రామా) వారికి అత్యవసర వైద్య సేవలు, మానసిక ఆరోగ్య వ్యాధుల స్క్రీనింగ్, ప్రాథమిక నిర్వహణ, అనారోగ్య సమస్యలను జయించడం, మానసిక ప్రశాంతత కోసం రోగులకు యోగాపై అవగాహన వంటి సేవలు అందిస్తున్నారు.

కైకలూరు నియోజకవర్గంలో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం ఇలా..

మండలం	హెల్త్ సెంటర్లు	అంచనా (రూ.కోట్లలో)	పూర్తయినవి	నిర్మాణంలో
కైకలూరు	17	3కోట్ల 32 లక్షల 35 వేలు	3	14
కలిదిండి	12	2కోట్ల 34 లక్షల 60 వేలు	4	8
మండవల్లి	14	2కోట్ల 73 లక్షల 70 వేలు	3	11
ముదినేపల్లి	12	2కోట్ల 34 లక్షల 60 వేలు	4	8
మొత్తం:	55	10కోట్ల 75 లక్షల 25 వేలు	14	41

పామర్రు మండలంలో జూన్, జూలై నెలల్లో ఇప్పటికి అందించిన సేవలు..

వైద్య పరీక్షలు	:	23,543
జనరల్ ఓపీ	:	13,346
గర్భిణులు	:	1234
బాలింతలు	:	923
బీపీ	:	4871
షుగర్	:	4098
రక్త హీనత	:	78
నోటి క్యాన్సర్	:	3
టీబీ	:	22
బోద	:	4

నెలలో రెండుసార్లు ..



ప్రతి గ్రామ సచివాలయంలో నెలలో రెండుసార్లు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. రోజుకు 80 నుంచి 100 మంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. షుగర్, బీపీ, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నాం. ప్రజలకు ప్రతిరోజూ గ్రామంలో వైద్యసిబ్బంది ప్రజలు సేవలు అందిస్తున్నారు.

–సతీష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, మోటూరు

కళాపీఠం నూతన కార్యవర్గం ఎంపిక

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో పద్మశ్రీ ఘంటసాల, ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం నూతన కమిటీ సభ్యుల ఎంపిక, ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా కాటూరి వెంకట మురళీ కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా బొగ్గరపు జాలయ్య, వరదా అప్పారావు, కోటి పాండురంగారావు, పాగోలు మహాదేవ్ రాజు, ఉప్పల రాజాబాబు, నందిపాటి హేమంత్‌రెడ్డిలను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా బావురుపల్లి పద్మజ, సాల్మన్‌రాజు కొల్లాబత్తుల, సీహెచ్ సుగుణావతి, కర్రి శ్రీధర్, కోశాధికారిగా కోడేబోయిన అజయ్, ప్రచార కార్యదర్శిగా ఆర్ఎస్ఎస్ ప్రసాద్, డైరెక్టర్లగా ఏరువ రజని, కూనపరెడ్డి విజయకుమారిలను ఎంపిక చేశారు. దగ్గుమిల్లి హరికృష్ణ, బొగ్గరపు సాయిబాబు, పూలబాల వరలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నేతకు నివాళి



గుడివాడ టౌన్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ కార్యదర్శి దివంగత మురాల రాజేష్ చేసిన సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మురాల రాజేష్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజేష్ అకాల మృతి పార్టీకి, పట్టణానికి తీరని లోటన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఆర్‌సీపీ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం. హరిబాబు, ఆర్ రఘు, కె.మరియమ్మ, వైవీ నరసింహరావు, శీలం ప్రకాశరావు పాల్గొన్నారు.

సాహితీవేత్త రామారావుకు నివాళి

మచిలీపట్నంటౌన్: సాహితీ తపస్వి, ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షుడు కొట్టి రామారావు సాహిత్య రంగానికి అందించిన సేవలు నిరుపమానమని పలువురు వక్తలు అన్నారు. కొట్టి రామారావు సంతాపసభ ఆదివారం స్థానిక వివేకానంద మందిరంలో నిర్వహించారు. మచిలీపట్నం సాహిత్య, సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ సాహితీరంగం ఆయనను కోల్పోవడం బాధాకరమన్నారు. సాహిత్యరంగానికి కొట్టి రామారావు అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వైద్యుడు ధన్వంతరీ ఆచార్య, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, భావతరంగిణి సంపాదకుడు భవిష్య, బందరు చరిత్ర రచయిత మొహమ్మద్ సిలార్, విశ్రాంత అధ్యాపకుడు సవరం వెంకటేశ్వరరావు, ఎల్. బాలాజీ, సాహితీవేత్తలు చింతలపాటి మురళీ కృష్ణ, కొల్లూరి రామ్మోహనరావు, గుడిపూడి రాధికారాణి పాల్గొన్నారు.

మణిపూర్ మహిళలకు న్యాయం చేయాలి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్గనైజేషన్ మహిళా సభ్యులు



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

పామర్రు: మణిపూర్‌లోని గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని నిరసిస్తూ పామర్రు జమాతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం, గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా సమావేశం ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెయ్యిమంది పురుషుల గుంపులో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశంలో మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు. మూడు నెలలుగా ఈ అమానుషాన్ని దాచిపెట్టిన ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేసి శాంతిని నెలకొల్పాలని, దోషులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమాజంలో నైతిక మార్పు కోరుతూ బ్యానర్‌ను ఆవిష్కరించారు. మాతె ఇస్లామీ హింద్ స్థానిక బాధ్యులు యూనుస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీన్ హుమైర్వే, షాహీన్, రాఫియా సబా, సనా, గౌసియాలతో పాటు జమాత్ మహిళా సభ్యులు కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: మణిపూర్ రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను నిలుపుదల చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని దళిత సంఘాల ఐక్యవేదిక గుడివాడ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గానికి మద్దతుగా నిలవడం కారణంగానే ఈ విధమైన ఘోర దాడులు జరుగుతున్నాయన్నారు. అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పొంగులేటి జయరాజు, కంచర్ల సుధాకర్, దారం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూల్ ఆవరణలో జరిగిన శిబిరంలో 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 135 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని సోమవారం ఆస్పత్రికి తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయిస్తామని సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. డాక్టర్ రియా, డాక్టర్ ఆకాంక్ష వైద్య సేవలు అందించారు. కంటి ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి ఎం.రవికుమార్, మండవ వెంకటేశ్వరరావు, తలశిల లీలామనోహర్, జమీలా మస్తాన్, కనిగంటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నంటౌన్: మణిపూర్‌లో జరిగిన హింసాకాండ, అల్లర్లకు గురైన బాధితులకు మనోధైర్యం కలగాలని కోరుతూ స్థానిక పరాసుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితి నెలకొని ప్రజలంతా శాంతియుతంగా జీవించేలా చూడాలని కోరుకున్నారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూరాలని ప్రార్థించారు. ప్రత్యేక ప్రార్థనల్లో చర్చి ఫాదర్ స్వామినాథన్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆ నాటి జ్ఞాపకాలు పదిలం



1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 ఏడాది పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విజయవాడ రోడ్డులోని ఆరేపల్లి కళ్యాణ మండపంలో నిర్వహించారు. 36 ఏళ్ల తర్వాత వారంతా కుటుంబ సభ్యులతోపాటు కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఆనందపరవశులయ్యారు. చిన్ననాటి స్నేహితులను ఒకరి నొకరు చూసుకుంటూ వయస్సుతోపాటు వచ్చిన మార్పులను చూసి మురిసి పోయారు. ప్రతి రోజూ ఉద్యోగ వ్యాపారాలతో ఎంతో బిజీ బిజీగా ఉండే వీరికి ఆదివారం ఆట విడుపు అయింది. వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనాటి చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకున్నారు. అమెరికా, హైదరాబాద్, విశాఖ పట్నం, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉంటున్న వీరు ఒక్క చోట కలుసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. ఆనాటి గురువులను సన్మానించారు. అనంతరం డ్యాన్సులు, డైలాగ్స్, నృత్యాలు, మహిళల ర్యాంప్‌వాక్, పురుషుల బ్రేక్ డ్యాన్సులతో కార్యక్రమంలో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహకరించాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పానిపిరెడ్డి శ్రీహరి, జన్యావుల శ్రీనివాసరావు, బొగ్గరపు శ్రీనివాసరావు, నూకల కొండా, శాస్త్రి, గ్లాడిసన్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చినపారుపూడి (పెదపారుపూడి): మండలంలోని చిన పారుపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8గంటల నుంచి ఎమ్మెల్యే కైలే కుమార్ గ్రామంలో వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరుగుతారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తారని తెలిపారు.

'గుప్పెడు మనసు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గుడివాడ టౌన్: తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత యలమర్తి అనూరాధ రచించిన 'గుప్పెడు మనస్సు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లోని ఆర్యవైశ్య కళ్యాణ వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణ కల్చరల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మంచి సందేశాన్నిచ్చే ఇటువంటి పుస్తకాలు రచించడం ఇటీవల తగ్గిందన్నారు. వాటిని ప్రోత్సహించాల్సిన అవసరత ఉందని తెలిపారు. తెలుగు భాషా వికాస సమితి ఈ విధమైన ప్రోత్సాహం చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వికాస సమితి సమన్వయ కర్త డీఆర్‌బీ ప్రసాదు, గజల్ గాయకుడు మేకా మాధవరావు, రచయిత వంగా శ్రీనివాస్, కళాకారుడు పీవీ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

గూడూరు: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. సేకరించిన వివరాల ప్రకారం.. అమలాపురం నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై చిట్టిగూడూరు సమీపంలో ఆదివారం ఉదయం అదుపు తప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణించే ముగ్గురు చిన్నారులతో సహా మరో ముగ్గురిని స్థానికులు కాపాడారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

100 మంది పిల్లలకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తీక్ రెడ్డి, దీప్తి

పామర్రు: స్థానిక నాలుగు రోడ్ల కూడలి వైఎస్సార్ విగ్రహం వద్ద విజయవాడకు చెందిన బ్రైట్ తల్లీపిల్లల హాస్పటల్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లల వైద్యులు బొమ్మారెడ్డి కార్తీక్ రెడ్డి, బొమ్మారెడ్డి దీప్తిల ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వర్షా కాలంలో కాచి చల్లార్చిన నీటిని పిల్లలకు తాగించాలన్నారు. ఆరోగ్య సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించి తగు విధమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 100 మందికి పైగా చిన్నారులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.బాల కృష్ణారెడ్డి, బి. రాజశేఖర్‌రెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, బి.శివ శంకర్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, డి.బాలవెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.